ప్రజాశక్తి
గురువారం 9 మార్చి 2023
5
శ్రీకాకుళం



26న రెవెన్యూ సర్వీసుల సంఘం ఎన్నికలు

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

ఎపి రెవెన్యూ సర్వీసుల సంఘం జిల్లా నూతన కార్యవర్గ ఎన్నికలు ఈనెల 26వ తేదీన నగరంలోని రెవెన్యూ అతిథిగృహంలో నిర్వహించనున్నట్లు సంఘ జిల్లా అధ్యక్షులు కె.శ్రీరాములు తెలిపారు. నగరంలోని రెవెన్యూ అతిథిగృహంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల నోటిఫికేషన్ బుధవారం విడుదలైందన్నారు. జిల్లా శాఖ కార్యవర్గం కాలపరిమితి ముగియడంతో 2023-2026 మధ్య కాలపరిమితికి నూతన కార్యవర్గాన్ని ఎన్నుకోనున్నట్లు చెప్పారు. ఎన్నికల అధికారిగా పార్వతీపురం మన్యం జిల్లా అధ్యక్షులు జి.శ్రీరామ్మూర్తి వ్యవహరించనున్నట్లు తెలిపారు.

పట్టభద్రుల చూపు పిడిఎఫ్ వైపు...

ప్రశ్నించే గొంతుకగా పిడిఎఫ్ ఎమ్మెల్సీలకు ప్రత్యేక గుర్తింపు

శాసన మండలిలో నిర్మాణాత్మక పాత్ర

నీతి, నిజాయతీతో మండలికే వన్నె తెచ్చిన సభ్యులు

కోరెడ్ల రమాప్రభ అభ్యర్థిత్వంపై మొగ్గు చూపుతున్న యువత



ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ సమీపిస్తుండడంతో ప్రచారం ఊపందుకుంటోంది. ఎన్నికల్లో పిడిఎఫ్ (ప్రోగ్రెసివ్ డెమోక్రటిక్ ఫ్రంట్), వైసిపి, టిడిపి అభ్యర్థులు పోటీలో ఉన్నా... ప్రధానంగా పిడిఎఫ్, అధికార వైసిపి మధ్య పోరు నెలకొంది. ఇందులో పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి డాక్టర్ కోరెడ్ల రమాప్రభ ప్రచారంలో దూసుకువెళ్తున్నారు. ఎన్నికల నోటిఫికేషన్ నుంచే ప్రచారంపర్వం మొదలు పెట్టిన ఆమె అందరికంటే ముందంజలో ఉన్నారు. ఇప్పటివరకు ఉమ్మడి మూడు జిల్లాల పరిధిలోని 118 మండలాలను కలియతిరిగారు. సుమారు 45వేల మంది ఓటర్లను ప్రత్యక్షంగా కలుసుకున్నారు. యువత నుంచి వస్తున్న అపూర్వ స్పందనతో రెట్టించిన ఉత్సాహంతో ప్రచారం పర్వం సాగిస్తున్నారు.

ప్రజాశక్తి, శ్రీకాకుళం ప్రతినిధి

సాధారణ ఎన్నికలతో పోలిస్తే పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు చాలా ప్రత్యేకత ఉంది. పట్టభద్రులే ఓటర్లుగా ఉండడంతో, ఓటింగ్ విషయంలో కొంత భిన్నంగా ఓటింగ్ ఉంటుందని అందరి అంచనా. అందుకే కాబోలు ఒకటీ అరా మినహా అన్ని స్థానాల్లోనూ మేధావులు, విద్యావంతులు, ఉద్యమ నేతలే శాసన మండలికి ఎంపికవుతూ వస్తున్నారు. ప్రొఫెసర్ కె.నాగేశ్వర్, చుక్కా రామయ్య, ఎం.వి.ఎస్ శర్మ, డి.రామిరెడ్డి, బి.బాలసుబ్రహ్మణ్యం, కె.ఎస్ లక్ష్మణరావు, వై.శ్రీనివాసులురెడ్డి, ఐ.వెంకటేశ్వరావు, షేక్ సాబ్జీ వంటి ప్రముఖులు ఆ జాబితాలో ఉన్నారు. ఇందులో ఎం.వి.ఎస్ శర్మ వరుసగా రెండుసార్లు ఉత్తరాంధ్ర పట్టభద్రుల స్థానం నుంచి ఎన్నికయ్యారంటే పట్టభద్రుల్లో పిడిఎఫ్ ఎమ్మెల్సీలకు ఉన్న స్థానం అటువంటింది. ప్రధాన రాజకీయ పార్టీల మాదిరిగా ఎన్నికల్లో డబ్బులు పంపిణీ చేసో, ప్రలోభాలకు గురిచేసో వారి ఎన్నిక కాలేదని వారి ఎన్నికైన విధానం స్పష్టం చేస్తోంది. శాసనమండలిలో విద్యావంతుల వాణిని బలంగా వినిపించడంతో, ఆయా ప్రాంతాల్లో సామాన్యుల తరుపున నిలబడడంతో యువత వారికి పట్టం కట్టారు. శాసనమండలి లోపల, వెలుపల ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్ల ఉద్యమాలన్నింటికీ ప్రత్యక్షంగా అండగా ఉండడంతో పిడిఎఫ్ అభ్యర్థుల వైపు మొగ్గు చూపిస్తున్నారు.

శాసనమండలికే వన్నె తెచ్చిన పిడిఎఫ్ ఎమ్మెల్సీలు

పిడిఎఫ్ తరుపున గెలుపొందిన ఎమ్మెల్సీలు తమ నీతి, నిజాయతీతో శాసనమండలికే వన్నె తెచ్చారు. శాసనమండలి సభ్యులుగా వారికి లభించే వేతనాలు, అలవెన్సులను వారి సొంతానికి ఒక్క రూపాయి వాడుకోలేదు. వారికి వచ్చిన సొమ్మును ప్రజా ఉద్యమాలకే వెచ్చించి ఆదర్శంగా నిలిచారు. ప్రభుత్వం ఉచితంగా ఖరీదైన ఇళ్ల స్థలాలను కేటాయించినా వాటిని తిరస్కరించారు. ఒక రాజకీయ పార్టీ నుంచి ఎమ్మెల్సీగా గెలుపొంది అధికార పార్టీలోకి ఫిరాయించడం సర్వసాధారణంగా మారిన ప్రస్తుత రోజుల్లో ప్రలోభాలకు లోనుకాకుండా నిజాయతీగా, పారదర్శకంగా వ్యవహరిస్తూ తమ ప్రత్యేకతను చాటుకుంటున్నారు. ఏదో ఒక రాజకీయ పార్టీ వైపు ఒరిగిపోకుండా విమర్శనాత్మకంగా ఉంటూనే నిర్మాణాత్మక పాత్రను పోషిస్తున్నారు.

విద్యావంతులకు స్థానమివ్వరా?

శాసనమండలిలో పట్టభద్రులకు ఐదు స్థానాలే ఉన్నాయి. విద్యావంతుల వాణిని వినిపించడానికి ఇక్కడ నుంచే ఎన్నికైన ఎమ్మెల్సీలకే అవకాశం ఉంటుంది. ప్రధాన రాజకీయ పార్టీలు ఈ అవకాశాన్నీ పట్టభద్రులకు ఇవ్వడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. పట్టభద్రుల స్థానంలో వైసిపి, టిడిపి తమ అభ్యర్థులను బరిలో దింపి వాటిని తమ ఖాతాలో వేసుకోవాలని చూస్తున్నాయి. ప్రధాన రాజకీయ పక్షాలు సర్పంచ్ నుంచి ఎంపీ వరకు తమ అభ్యర్థులను నిలబెట్టి గెలిపించుకుంటున్నాయి. వారు చేస్తున్న అభివృద్ధి, ప్రజా సమస్యలపై వారు స్పందిస్తున్న తీరు ఏమిటో అందరికీ తెలిసిందే. పైగా రాజకీయ పార్టీల నుంచి ఎన్నికైన ప్రతినిధులకు పార్టీ అజెండా తప్ప స్వతంత్రంగా వ్యవహరించే అవకాశం ఉండదనేది వేరే చెప్పనక్కర్లేదు. అటువంటి పరిస్థితుల్లో ప్రజా సమస్యల విషయంలో స్వతంత్రంగా వ్యవహరిస్తున్న పిడిఎఫ్ అభ్యర్థుల వైపు యువత మొగ్గుచూపడం సహజమే. అందులో భాగంగానే పిడిఎఫ్ తరుపున నిలబడిన కోరెడ్ల రమాప్రభకు ప్రచారంలో ఆ రకమైన స్పందన కనిపిస్తోందని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

ప్రశ్నించే గొంతుకగా పిడిఎఫ్

శాసన మండలి లోపల, వెలుపల ఉత్తరాంధ్ర సమస్యలపై పిడిఎఫ్ ఎమ్మెల్సీలు అలుపెరగని పోరాటం సాగిస్తున్నారు. ఉత్తరాంధ్రకు తలమానికంగా, వేలాది మందికి ఉపాధి కల్పిస్తున్న విశాఖ స్టీల్‌ప్లాంట్ అమ్మకానికి పెట్టి ఈ ప్రాంత ప్రజలకు చేస్తున్న అన్యాయంపై కేంద్రాన్ని ప్రశ్నించడంతో పాటు విశాఖ ఉద్యమానికి వారు అడుగడుగునా అండగా నిలిచారు. విభజన చట్టం హామీలు, విశాఖకు రైల్వేజోన్, ఉత్తరాంధ్రకు ప్రత్యేక ప్యాకేజీ తదితర అంశాల్లో కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం రాష్ట్రానికి చేస్తున్న అన్యాయంపై ప్రశ్నించాల్సిన వైసిపి, టిడిపి నోరు మెదకపోగా కేంద్ర ప్రభుత్వానికి వ్యవసాయ పంపు సెట్లకు మీటర్ల బిగింపు, వ్యవసాయ బిల్లు తదితర అవసరమైన అంశాల్లో పోటీ పడి మరీ మద్దతు పలుకుతున్నాయి. ఈ నేపథ్యంలో రాష్ట్రానికి జరుగుతున్న అన్యాయంపై పిడిఎఫ్ ఎమ్మెల్సీలే ఎప్పటికప్పుడు తమ గొంతు వినిపిస్తున్నారన్న చర్చ యువతలో సాగుతోంది. పాలక, ప్రతిపక్ష పార్టీల వైఖరిని గమనిస్తున్న పట్టభద్రులు మార్చి 13న జరుగనున్న ఎన్నికల్లో వారి గొంతుకగా నిలిచే వారికి తీర్పునిచ్చేందుకు సిద్ధంగా ఉన్నారు.



ర్యాలీ నిర్వహిస్తున్న సంఘాల నాయకులు, మహిళలు

ఐక్య ఉద్యమాలతోనే హక్కుల సాధన

- సమాన హక్కుల కల్పనలో మహిళలపై వివక్ష
- మహిళా, ప్రజాసంఘాల ఆధ్వర్యాన ర్యాలీ

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

అంతర్జాతీయ మహిళా దినోత్సవ స్ఫూర్తితో హక్కుల సాధన కోసం ఐక్యంగా ఉద్యమించాలని ఐద్వా, సిఐటియు, యుటిఎఫ్, ఎస్ఎఫ్ఐ నాయకులు పిలుపునిచ్చారు. మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని నగరంలోని ఏడు రోడ్ల జంక్షన్ నుంచి డైమండ్ పార్కు వరకు బుధవారం ర్యాలీ నిర్వహించారు. శ్రామిక మహిళా సమన్వయ కమిటీ జిల్లా కన్వీనర్ కె.నాగమణి, యుటిఎఫ్ రాష్ట్ర నాయకులు ఎం.వాగ్దేవి, జిల్లా సహాధ్యక్షులు బి.ధనలక్ష్మి, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు ఎ.మహాలక్ష్మి, ఐద్వా జిల్లా కార్యదర్శి ఎ.లక్ష్మి, పట్టణ కార్యదర్శి శ్రీదేవి పాణిగ్రాహి మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మహిళా సాధికారతపై మాటలకే పరిమితం తప్ప ఆచరణలో చేసిందేమీ లేదని విమర్శించారు. అనేక సంవత్సరాలుగా మహిళలకు చట్టసభల్లో 33 శాతం రిజర్వేషన్లు నేటికీ అమలు కాకపోవడమే మహిళలపై ఉన్న వివక్షకు నిదర్శనమన్నారు. మహిళలపై అత్యాచారాలు, హింస, వేధింపులు, వరకట్న మరణాలు నిత్యకృత్యమయ్యాయని ఆందోళన వ్యక్తం చేశారు. పెట్టుబడిదారీ సమాజంలో మహిళను వ్యాపార సరుకుగా మార్చి వ్యాపార ప్రకటనలకు అంగడి వస్తువుగా చూపిస్తున్న పరిస్థితి ఉందన్నారు. మహిళలకు సమాన హక్కులు కల్పించడంలో వివక్ష ఉంటోందని తెలిపారు.

పని ప్రదేశాల్లో లైంగిక వేధింపులు, హత్యలు, అత్యాచారాలు జరుగుతున్నా సరైన భద్రత లేదన్నారు. పురుషులతో సమానంగా పనిచేస్తున్నా సమాన హక్కులు కల్పించకపోగా వివక్షగా చూస్తున్న పరిస్థితి ఉందన్నారు. నూతన ఆర్థిక విధానాలు వచ్చిన తర్వాత మహిళల పరిస్థితి మరీ దిగజారిపోయిందని తెలిపారు. దేశవ్యాప్తంగా ప్రభుత్వరంగ పథకాల్లో కోటి మంది మహిళా కార్మికులు అనేక సంవత్సరాలుగా పనిచేస్తున్నా వేతనాలు, ఉద్యోగ భద్రత, ఇతర సౌకర్యాలు కల్పించకుండా ప్రభుత్వాలు తీవ్రంగా శ్రమదోపిడీ చేస్తున్నాయని విమర్శించారు, సారా వ్యతిరేక ఉద్యమం, అక్షరాస్యత, లింగ వివక్షత, ఆస్తి హక్కు, శ్రామిక మహిళ హక్కుల కోసం జరిగిన ఉద్యమాల్లో మహిళలు కీలకపాత్ర పోషించారని గుర్తుచేశారు. ఈ పోరాటాల్లో అనేక హక్కులు సాధించుకుని మహిళలకు అండగా నిలబడి పోరాడిన చరిత్ర సంఘాలకు ఉందన్నారు. వివక్ష, శ్రమ దోపిడీకి వ్యతిరేకంగా సమాన హక్కుల కోసం సాగే భవిష్యత్ పోరాటాలకు దీక్షా దినంగా పాటిస్తున్నట్టు తెలిపారు. ర్యాలీలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు సిహెచ్.రాజు, యుటిఎఫ్ జిల్లా నాయకులు ఎస్.స్వర్ణకుమారి, వసుంధర, దమయంతి, సిఐటియు నాయకులు కె.కళ్యాణి, పి.లతాదేవి తదితరులు పాల్గొన్నారు.

పరీక్షల సమయం

- నేటి నుంచి పదో తరగతి విద్యార్థులకు ప్రీ ఫైనల్
- మూడు నుంచి తొమ్మిది తరగతులకు ఎఫ్ఎ-4 పరీక్షలు

ప్రజాశక్తి - పలాస

జిల్లాలోని ప్రభుత్వ, ప్రయివేటు పాఠశాలలు పరీక్షల నిర్వహణకు సన్నద్ధమయ్యాయి. ఈనెల తొమ్మిదో తేదీ నుంచి మూడు నుంచి తొమ్మిది తరగతుల విద్యార్థులకు ఎఫ్ఎ-4, పదో తరగతి విద్యార్థులకు ప్రీ ఫైనల్ పరీక్షలు జరుగనున్నాయి. విద్యాశాఖ ఆదేశాల మేరకు అధికారులు ఏర్పాట్లు చేశారు.

తరగతుల వారీగా...

ప్రాథమిక స్థాయిలో 3, 4, 5 తరగతులకు చెందిన విద్యార్థులకు తొమ్మిదో తేదీన ఉదయం 10 నుంచి 11 గంటల వరకు ఒఎస్-ఎస్‌సి పరీక్ష నిర్వహిస్తారు. 10న తెలుగు, గణితం, 14న ఇంగ్లీషు, పరిసరాల విజ్ఞానం పరీక్షలు నిర్వహించనున్నారు.

6, 7, 8 తరగతులకు సంబంధించి మధ్యాహ్నం 1.30 గంటల నుంచి రెండు పరీక్షలు నిర్వహించనున్నారు. 9న ఒఎస్ఎస్‌సి 1, 2... 10న తెలుగు, గణితం, 14న హిందీ, జనరల్ సైన్స్, 15న ఇంగ్లీష్, సోషల్ పరీక్షలు జరుగనున్నాయి.

9వ తరగతికి ఉదయం 9.30 నుంచి 11.45 గంటల వరకు పరీక్షలు నిర్వహించనున్నారు. 9న బిఎస్ఎస్‌పి, 10న తెలుగు, గణితం, 14న హిందీ, జనరల్ సైన్స్, 15న ఇంగ్లీషు, సోషల్ పరీక్షలు నిర్వహించనున్నారు.

పదో తరగతి విద్యార్థులకు ప్రీ ఫైనల్ పరీక్షలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. 9న ప్రథమ భాష, కాంపోజిట్ కోర్సు పేపరు-1, 10న ద్వితీయ భాష, 14న ఇంగ్లీషు, 15న గణితం, 16న సైన్స్, 17న సోషల్, 18న కాంపోజిట్ కోర్సు పేపరు-2, బిఎస్ఎస్‌సి మెయిన్ పేపరు-1, 20న ఒఎస్ఎస్‌సి మెయిన్ లాంగ్వేజీ పేపరు-2 పరీక్షలు నిర్వహించనున్నారు.

15 నుంచి ఇంటర్, డిగ్రీ విద్యార్థులకు...

జిల్లాలోని ఇంటర్, డిగ్రీ విద్యార్థులకు ఈనెల 15 నుంచి పరీక్షలు ప్రారంభం కానున్నాయి. డిగ్రీకి సంబంధించి 3, 5 సెమిస్టర్ పరీక్షలు ఈనెల 15 నుంచి 29వ తేదీ వరకు నిర్వహించనున్నారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఐదో సెమిస్టర్, మధ్యాహ్నం రెండు నుంచి ఐదు గంటల వరకు మూడో సెమిస్టర్ పరీక్షలను నిర్వహించనున్నారు. 15న ఇంటర్ ప్రథమ సంవత్సరం, 16వ తేదీ నుంచి ద్వితీయ సంవత్సర పరీక్షలు ప్రారంభం కానున్నాయి.

ఏర్పాట్లు పూర్తి చేశాం



జిల్లాలోని ప్రభుత్వ, ప్రభుత్వ గుర్తింపు పొందిన అన్ని పాఠశాలల్లో పరీక్షల నిర్వహణకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేశాం. మూడు నుంచి తొమ్మిది తరగతుల విద్యార్థులకు ఎఫ్ఎ-4, పదో తరగతి విద్యార్థులకు ప్రీ ఫైనల్ పరీక్షలు ఈనెల తొమ్మిదో తేదీ నుంచి నిర్వహించనున్నాం. శతశాతం ఉత్తీర్ణతే లక్ష్యంగా పనిచేయాలని ఆయా పాఠశాలల సిబ్బందిని ఆదేశించాం.

- జి.పగడాలమ్మ
జిల్లా విద్యాశాఖాధికారి



పట్టభద్రుల ఎన్నికల్లో వైసిపి ప్రలోభాలు

- నేరుగా ఓటర్ల బ్యాంకు ఖాతాలకు నగదు
- వాలంటీర్లతో ఓటర్ల సమాచారం సేకరణ
- ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేస్తాం
- నకిలీ ఓటర్లపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలి
- టిడిపి జిల్లా అధ్యక్షులు కూన రవికుమార్



సమావేశంలో మాట్లాడుతున్న రవికుమార్

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎన్నికల్లో అధికార వైసిపి ప్రలోభాలకు తెర తీస్తోందని తెలుగుదేశం పార్టీ జిల్లా అధ్యక్షులు కూన రవికుమార్ విమర్శించారు. నగరంలోని శాంతినగర్ కాలనీలో గల ఆయన నివాసంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో మోసపూరితంగా గెలవాలని ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి కంకణం కట్టుకున్నారన్నారు. చివరకు పట్టభద్రుల ఎన్నికలనూ అవినీతిమయం చేసి నెగ్గాలని ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. పట్టణాలు, గ్రామాల్లో వాలంటీర్ల ద్వారా ఓటర్ల సమాచారాన్ని సేకరించి, వారి బ్యాంకు ఖాతాలకు రూ.ఐదు వేల నుంచి రూ.పది వేల వరకు జమ చేస్తున్నారని ఆరోపించారు. పట్టభద్రుల ఖాతాల్లో ఇంత మొత్తం జమ అయిన వాటిని పరిశీలించి చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. జిల్లాలోని ఇద్దరు మంత్రులు, స్పీకర్ ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేసే విధంగా వ్యవహరిస్తున్నారని ధ్వజమెత్తారు.

ఉద్యోగులు, ఉపాధ్యాయులకు చెల్లించాల్సిన అనేక సౌకర్యాల్లో కోతలు విధించి, ప్రతినెలా ఒకటో తేదీన జీతాలు చెల్లించని ప్రభుత్వం, వారి ఆత్మగౌరవాన్ని దెబ్బతీయడానికి పూనుకుంటోందన్నారు. మరోవైపు నిరక్షరాస్యులు, ఐదు, పదో తరగతి చదవిన వారిని పట్టభద్రుల ఓటర్లుగా నమోదు చేశారని తెలిపారు. తప్పుడు ధ్రువపత్రాలతో ఓటర్లుగా నమోదు చేసిన వారిపై ఎన్నికల సంఘం చర్యలు తీసుకోవాలని కోరారు. నకిలీ ధ్రువీకరణ పత్రాలను అప్‌లోడ్ చేసిన వ్యక్తులు, వాలంటీర్లపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలన్నారు. అర్హత లేని వారు పట్టభద్రులుగా ఓటు నమోదు చేసుకుంటే జిల్లా యంత్రాంగం వారిపై ఎందుకు చర్యలు తీసుకోలేదని ప్రశ్నించారు. మేధావులు, ఉద్యోగులు, ఉపాధ్యాయులు ఆలోచించి వైసిపి ప్రభుత్వ ప్రజా, ఉద్యోగ వ్యతిరేక విధానాలను ఓటు ద్వారా తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు.

మైక్రో అబ్జర్వర్ల పాత్ర కీలకం

- అబ్జర్వర్ డైరీలో నిబంధనలు పాటించాలి
- పోలింగ్‌కు గంట ముందుగా కేంద్రానికి చేరుకోవాలి
- ఎన్నికల పరిశీలకులు జె.శ్యామలరావు

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణలో మైక్రో అబ్జర్వర్ నిబంధనలు సక్రమంగా అమలయ్యేలా చూడాలని ఎన్నికల పరిశీలకులు జె.శ్యామలరావు అన్నారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో బుధవారం నిర్వహించిన మైక్రో అబ్జర్వర్ శిక్షణా తరగతుల్లో ఆయన మాట్లాడారు. మైక్రో అబ్జర్వర్ ఎన్నికల ప్రక్రియ సక్రమంగా జరిగేలా పరిశీలించాలన్నారు. పోలింగ్‌కు గంట ముందుగా కేంద్రానికి చేరుకోవాలని సూచించారు. మహిళలు, వికలాంగులు, వృద్ధులకు ప్రత్యేక క్యూ లైన్ ఏర్పాటు చేయాలన్నారు. మంచినీరు ఇతర మౌలిక సదుపాయాల ఏర్పాట్లను పరిశీలించాలని సూచించారు. రాజకీయ పార్టీల పోలింగ్ ఏజెంట్లు, ఇతర సిబ్బంది హాజరు పరిశీలించాలన్నారు. అబ్జర్వర్ డైరీలోని నిబంధనలు పాటించాలని, చెక్ లిస్ట్ ప్రకారం నరిచూసుకోవాలని చెప్పారు.




మాట్లాడుతున్న ఎన్నికల పరిశీలకులు శ్యామలరావు

జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్ మాట్లాడుతూ శాసన మండలి ఎన్నికలు సజావుగా, ప్రశాంతంగా జరిగేందుకు మైక్రో అబ్జర్వర్లు కీలకంగా వ్యవహరించాలన్నారు. పోలింగ్ కేంద్రాల వద్ద ఏమైనా ఇబ్బందులు తలెత్తితే ప్రిసైడింగ్ అధికారి దృష్టికి తీసుకురావాలని సూచించారు. మార్చి 12వ తేదీన ఎన్నికలకు సంబంధించి సామగ్రిని పంపిణీ చేయనున్నట్లు చెప్పారు. పోలింగ్ కేంద్రాల్లో పోలింగ్‌కు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేసుకోవాలన్నారు. ఎన్నికలకు వెబ్ కాస్టింగ్ ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. ఈనెల 13వ తేదీన పోలింగ్‌కు ముందు పారదర్శకతకు ఖాళీ బ్యాలెట్ బాక్స్‌ను ఏజెంట్ సమక్షంలో చూపించి పోలింగ్ ప్రారంభించాలన్నారు. ఓటు హక్కును వినియోగించుకునేందుకు గుర్తింపు కార్డు తప్పనిసరి అని స్పష్టం చేశారు. అనంతరం ఎన్నికల ప్రక్రియ ముగిసే వరకు పకడ్బందీగా నిర్వహించేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై శిక్షణ ఇచ్చారు. అనంతరం ఎన్నికల ప్రక్రియలో భాగంగా పోలింగ్ సిబ్బంది నియామకానికి సంబంధించి ర్యాండోమైజేషన్ ప్రక్రియ నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి రాజేశ్వరి, మైక్రో అబ్జర్వర్లు పాల్గొన్నారు.

వైభవంగా అరసవల్లి డోలోత్సవం

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్



అరసవల్లి సూర్యనారాయణ స్వామి ఆలయంలో బుధవారం డోలోత్సవం నిర్వహించారు. ఉదయం 6.30 గంటలకు ఆలయ ప్రధాన అర్చకులు ఇప్పిలి శంకర శర్మ ఆధ్వర్యాన ఆలయ సంప్రదాయం ప్రకారం ఉషా, పద్మిని, ఛాయా సమేత సూర్యనారాయణ స్వామి ఉత్సవమూర్తులకు తిరువీధి మహోత్సవం నిర్వహించారు. ఆలయానికి చెందిన చిన్న తోటలో స్వామివారికి విశేష అర్చనలు, బుక్కా భర్గుండతో, సుగంధ ద్రవ్యాలతో ప్రత్యేక వేడుకలను నిర్వహించారు. మధ్యాహ్నం 11.30 గంటల వరకు సాగిన ఈ ఉత్సవాల అనంతరం తిరిగి ఆలయానికి చేర్చిన ఉత్సవమూర్తులకు ప్రత్యేక అలంకరణ చేశారు. కార్యక్రమంలో ఆలయ సూపరింటెండెంట్ కె.వెంకటేశ్వరరావు, జూనియర్ అసిస్టెంట్ బి.ఎస్ చక్రవర్తి, అర్చకులు పాల్గొన్నారు.

నేడు, రేపు కిరణస్పర్శ

అరసవల్లి సూర్యనారాయణ స్వామి ఆలయంలో ఉత్తరాయణంలో ఏటా మార్చి 9, 10 తేదీల్లో సూర్యకిరణాలు స్వామివారి మూలవిరాట్టును తాకనున్నాయని ఆలయ కార్యనిర్వహణాధికారి వి.హరిసూర్యప్రకాష్, ఆలయ ప్రధాన అర్చకులు ఇప్పిలి శంకరశర్మ తెలిపారు.

ఉత్తరాంధ్ర సమగ్రాభివృద్ధికి పనిచేస్తా...

పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి డాక్టర్ కోరెడ్ల రమాప్రభ

ప్రజాశక్తి - అనకాపల్లి



షిప్‌యార్డ్ గేటు వద్ద ఎన్నికల ప్రచారంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ అభ్యర్థి రమాప్రభ

ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థిగా గెలిపిస్తే ఉత్తరాంధ్ర సమగ్రాభివృద్ధితో పాటు సిపిఎస్ రద్దు, ఉద్యోగులకు ఇచ్చిన హామీల పరిష్కారం, ప్రభుత్వ సంస్థల పరిరక్షణ, కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల క్రమబద్ధీకరణ, జిఒ నెంబరు 3 పునరుద్ధరణ వంటి పలు అంశాలపై శాసనమండలిలో ప్రస్తావిస్తానని పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి డాక్టర్ కోరెడ్ల రమాప్రభ చెప్పారు. స్థానిక దొడ్డి రామినాయుడు కార్మిక, కర్షక భవనంలో బుధవారం జరిగిన విలేకర్ల సమావేశంలో ఆమె మాట్లాడారు. రాష్ట్ర విభజన చట్టం హామీ ప్రకారం వెనుక బడిన ప్రాంతాల అభివృద్ధి నిధులు ఉత్తరాంధ్ర జిల్లాలకు రాబెట్టేందుకు శక్తివంచనలేకుండా కృషిచేస్తానన్నారు. 250కిపైగా ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, పెన్షనర్లు, ప్రజా సంఘాలు బలపర్చిన అభ్యర్థిగా ప్రజా సమస్యల పరిష్కారం కోసం పనిచేస్తానన్నారు. రూ.3.50 లక్షల కోట్ల విలువైన విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను రూ.30వేల కోట్లకు విక్రయించే ప్రభుత్వ ప్రయత్నాలను అడ్డుకోవడానికి కృషి చేస్తానని చెప్పారు. ప్రజాస్వామ్య హక్కుల పరిరక్షణకు పోరాడతానన్నారు. ఉద్యోగులు, కార్మికులు, నిరుద్యోగుల సమస్యల కోసం పనిచేసే వేదిక పిడిఎఫ్ అని తెలిపారు. పిడిఎఫ్ తరపున పోటీచేస్తున్న తనను గెలిపిస్తే ఆయా తరగతుల సమస్యలపై పనిచేస్తానన్నారు. స్కీం వర్కర్ల సమస్యలపై కూడా శాసనమండలిలో ప్రస్తావించి వాటిని బలోపేతం చేయడానికి ప్రయత్నిస్తానన్నారు. ఉత్తరాంధ్రలో మూతపడ్డ సహకార చక్కెర కర్మాగారాల పునరుద్ధరణకు ప్రభుత్వంపై ఒత్తిడితెస్తానని చెప్పారు.

షిప్‌యార్డు ఉద్యోగ, కార్మికుల హక్కుల పరిక్షణకు కృషి

హిందుస్థాన్ షిప్‌యార్డ్ సంస్థలోని ఉద్యోగ, కార్మికుల హక్కులు సాధనకు నిబద్ధతతో కృషి చేస్తానని పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి డాక్టర్ కోరెడ్ల రమాప్రభ హామీఇచ్చారు. బుధవారం ఎన్నికల ప్రచారంలో భాగంగా షిప్‌యార్డు గేటు వద్ద ఉద్యోగులు, కార్మికులను కలిసి మాట్లాడారు. విశాఖ అభివృద్ధిలో హిందుస్థాన్ షిప్‌యార్డుకు విశేష ప్రాధాన్యత ఉందని, సంస్థ అభివృద్ధికి పాటుపడతానన్నారు. రాజకీయాలకు అతీతంగా 250 ప్రజాసంఘాలు తనకు మద్దతునిస్తున్నాయని, వారి ఆశలు, ఆకాంక్షలు వమ్ముకాకుండా, అందరి పక్షాన నిలబడి పోరాటం కొనసాగిస్తానని భరోసానిచ్చారు. కార్యక్రమంలో షిప్‌యార్డు గుర్తింపు యూనియన్ ప్రధాన కార్యదర్శి ఎంవి.రమణమూర్తి, షిప్ యార్డు సిఐటియు అధ్యక్ష ,ప్రధాన కార్యదర్శులు రాంజీ, అంబేద్కర్, ఎస్.ప్రసాద్, ఎఐటియుసి నేతలు మళ్ల చిన్నా, సిఐటియు జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు, జోన్ నాయకులు పి.పైడిరాజు, యూనియన్ నేతలు బిఎస్ఎన్ రాజు, జి.సత్యనారాయణ, ప్రసాద్, కె.రామచంద్రరావు, గోవింద్ పాల్గొన్నారు.


శ్రీకాకుళం అర్బన్ : లక్ష్మీదేవిని సన్మానిస్తున్న మహిళలు


పలాస : సన్మానిస్తున్న సిసిలు, సిఎఫ్‌లు


శ్రీకాకుళం అర్బన్ : ర్యాలీ నిర్వహిస్తున్న స్త్రీ విముక్తి నాయకులు


టెక్కలి రూరల్ : మహిళలతో ఐతమ్ కళాశాల డైరెక్టర్ నాగేశ్వరరావు


వజ్రపుకొత్తూరు : మాట్లాడుతున్న సుగుణావతి


పోలాకి : ర్యాలీ నిర్వహిస్తున్న వెలుగు సిబ్బంది


మెళియాపుట్టి : హంసమ్మను సన్మానిస్తున్న నాయకులు


కవిటి : మహిళలను సన్మానిస్తున్న వెలుగు సిబ్బంది


పొందూరు : సన్మానిస్తున్న ఎపిఎం శ్యామలరావు


ఆమదాలవలస : ర్యాలీ నిర్వహిస్తున్న మహిళలు


శ్రీకాకుళం అర్బన్ : బహుమతిని అందజేస్తున్న గొండు శంకర్


ఇచ్ఛాపురం : కానిస్టేబుళ్లను సన్మానిస్తున్న సిఐ ఈశ్వరచంద్ర ప్రసాద్


లావేరు : సన్మానిస్తున్న బెజ్జిపురం యూత్‌క్లబ్ అధ్యక్షులు ప్రసాదరావు

సరికొత్త ఉషస్సుకు నాంది పలకాలి

ఘనంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవం

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

పోటీ ప్రపంచంలో పురుషులతో సమానంగా మహిళలు అన్ని రంగాల్లో ఆత్మవిశ్వాసంతో ఎదగాలని నారీశక్తి అవార్డు గ్రహీత పడాల భూదేవి అన్నారు. నగరంలోని ఆర్ట్స్ కళాశాల మైదానంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా బుధవారం పలువురు మహిళలను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో స్టార్ వాకర్స్‌క్లబ్ ఇంటర్నేషనల్ గౌరవ అధ్యక్షులు జి.ఇందిరాప్రసాద్, సొంగల అలివేలు, అరుగుల లక్ష్మి, స్టార్ వాకర్స్ క్లబ్ అధ్యక్షులు శాసపు జోగినాయుడు పాల్గొన్నారు.

మహిళలు పురుషులతో సమానంగా రాణించి ఉన్నతంగా ఎదగాలని టిడిపి నియోజకర్గ నాయకులు, సర్పంచ్‌ల సంఘం జిల్లా అధ్యక్షులు గొండు శంకర్ ఆకాంక్షించారు. మహిళా దినోత్సవం సందర్భంగా నగరంలోని సన్‌రైజ్ హోటల్‌లో నిర్వహించిన వంటలు, ఫ్యాషన్ షోలో విజేతలకు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో నియోజకవర్గ మహిళా అధ్యక్షులు గొండు స్వాతి, మాజీ కౌన్సిలర్ అంబటి లక్ష్మీరాజ్యం పాల్గొన్నారు.

నైర కళాశాలలో...

నైరా వ్యవసాయ కళాశాలలో అసోసియేట్ డీన్ డాక్టర్ డి.శ్రీనివాస్ భారతీయ సంస్కృతిలో మహిళలకు గొప్ప స్థానం ఉందని వివరించారు. కార్యక్రమాన్ని కళాశాల ఎన్ఎస్ఎస్ అధికారులు శ్రీసంధ్య డాక్టర్ జి.ఎస్.రోయ్ పాల్గొన్నారు.

రోటరీ పురస్కారం

గూడెంలో కంటి వెలుగు కార్యక్రమం భాగగా ప్రజలకు ఉత్తమ వైద్య సేవలు అందిస్తున్న ఆరోగ్య కార్యకర్త పి.అన్నపూర్ణ, ఎంఎల్‌హెచ్‌పి టి.జగదీశ్వరి, ఆశా కార్యకర్తలు పిట్ట పద్మావతి, పి.ఇందుమతిలను రోటరీ సహాయ గవర్నర్ ఎం.ఆర్.కె.దాస్ సన్మానించారు.

టిడిపి ఆధ్వర్యాన..

నగరంలోని జిల్లా టిడిపి కార్యాలయంలో మహిళ దినోత్సవం సందర్భంగా మాజీ ఎమ్మెల్యే గుండ లక్ష్మీదేవిని మహిళలు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో నగర టిడిపి అధ్యక్షులు మాదారపు వెంకటేష్, జిల్లా ఉపాధ్యక్షులు తోనింగి వెంకన్న యాదవ్, నగర తెలుగు యువత ప్రధాన కార్యదర్శి తాలూరి నవీన్, కొమ్మర కమల, త్రిలోచన, మాధవి, కళావతి, ఆశీరమ్మ, దేవకన్య పాల్గొన్నారు.

చేయూత మేమున్నాం...

స్థానిక చేయూత మేమున్నాం స్వచ్ఛంద సేవా సంఘం కార్యాలయంలో ఆ సంఘం అధ్యక్షులు వైశ్య రాజు వెంకటలక్ష్మి నేతృత్వంలో ఉత్తమ సేవలు అందించిన మహిళలకు సన్మానించారు. కార్యక్రమంలో సంస్థ గౌరవ అధ్యక్షుడు కోరాడ హరగోపాల్, సంగీత, శైలజ, ధనలక్ష్మి, అరుణ, జ్యోతమ్మ, బాలామణి, జమ్మా లక్ష్మి, మణిశర్మ, గుడ్ల మల్లేశ్వరరావు పాల్గొన్నారు.

గురజాడ విద్యా సంస్థల్లో ..

'స్త్రీ నిరంతరం మారుతున్న సాంకేతికతను అందుకోవాలని 'గురజాడ విద్యా సంస్థల డైరెక్టర్ సంయుక్త అన్నారు. గాయత్రి కాలేజీ అఫ్ సైన్స్ అండ్ మేనేజ్‌మెంట్‌లో కళాశాలలో నిర్వహించిన మహిళా దినోత్సవంలో గణితశాస్త్ర ఉపన్యాసాకులు అరుణ, ప్రిన్సిపాల్ డాక్టర్ పులఖండం శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు శారద, రేవతి, హేమలత, సునీత, సునీతారాణి పాల్గొన్నారు.

ఎపిటిఎఫ్ ఆధ్వర్యాన...

నగరంలోని పిఎస్ఎన్ఎం స్కూల్‌లో నిర్వహించిన మహిళా దినోత్సవంలో ఎపిటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి దవళ సరస్వతి, రాష్ట్ర అధ్యక్షులు కొప్పల భానుమూర్తి ,మహిళా ఉద్యమ హక్కుల నాయకురాలు తాండ్ర అరుణ, మాజీ ఉపాధ్యక్షులు టి.రమాదేవి, జిల్లా అధ్యక్షులు మజ్జి మదన్ మోహన్, ప్రధాన కార్యదర్శి బల్ల సుభాష్‌బాబు, చావలి శ్రీనివాస్, దాసరి రామ్మోహనరావు పాల్గొన్నారు.

స్త్రీ విముక్తి ఆధ్వర్యాన

నగరంలోని చౌదరి సత్యనారాయణ కాలనీలో అంతర్జాతీయ శ్రామిక మహిళా పోరాట దినోత్సవాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో స్త్రీవిముక్తి సంఘటన నాలయకులు తాండ్ర అరుణ, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు డి.తవిటమ్మ, చింతాడ తిరుమలరావు పాల్గొన్నారు.

వైసిపి కార్యాలయంలో...

నగరంలోని వైసిపి జిల్లా కార్యాలయంలో జిల్లా మహిళా విభాగం అధ్యక్షురాలు చింతాడ మంజు అధ్యక్షతన నిర్వహించిన మహిళా దినోత్సవంలో వైసిపి జిల్లా అధ్యక్షులు, నరసన్నపేట ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్, జెడ్‌పి చైర్‌పర్సన్ పిరియా విజయ, కేంద్ర మాజీ మంత్రి కిల్లి కృపారాణి, ఎం.వి.పద్మావతి, మాజీ మంత్రి త్రిపురాన వెంకటరత్నం, డిసిఎంఎస్ చైర్‌పర్సన్ చల్ల సుగుణ, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సువ్వారి సువర్ణ, సుడా చైర్‌పర్సన్ కోరాడ ఆశాలత, ఇచ్ఛాపురం మున్సిపల్ చైర్‌పర్సన్ పిలక రాజ్యలక్ష్మి, బల్లేడ పద్మావతి, వెలమ కార్పొరేషన్ చైర్‌పర్సన్ పంగ కృష్ణవేణి, శ్రీశయన కార్పొరేషన్ చైర్‌పర్సన్ చీపురు రాణి, పొందర కార్పొరేషన్ చైర్‌పర్సన్ రాజాపు హైమవతి పాల్గొన్నారు.

పావురం వెంట్రుకపై మహిళా దినోత్సవ చిత్రం

శ్రీకాకుళం అర్బన్ : అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భాన్ని పురస్కరించుకుని నగరానికి చెందిన చిత్రకారుడు వాడాడ రాహుల్ పావురం వెంట్రుకపై పొత్తిళ్లలో అక్కున చేర్చుకున్న మాతృమూర్తి చిత్రాన్ని వేసి మహిళ గొప్పతనాన్ని చాటి చెప్పారు. గతంలోనూ రాహుల్ ఎన్నో చారిత్రక చిత్రాలను వేశారు. ఇప్పుడు మహిళా దినోత్సవం వేసిన చిత్రం ఆకట్టుకుంటోంది.

కవిటి: కవిటి మహిళా సమాఖ్య భవనంలో మహిళా దినోత్సవం సందర్భంగా కేకను కట్ చేసి, పలువురు మహిళలను ఘనంగా సన్మానించారు. అనంతరం మహిళలకు రంగవల్లికల పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఎపిఎం గోవింద్, ఎంఎంఎస్ అధ్యక్షులు జె.కమల పాల్గొన్నారు.

పోలాకి : మండలంలో వెలుగు కార్యాలయంలో ఎపిఎం రాజారావు ఆధ్వర్యాన మహిళా దినోత్సవం సందర్భంగా ర్యాలీ నిర్వహించారు. ముగ్గులు పోటీలు నిర్వహించి బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో మండల మహిళా సమాఖ్య అధ్యక్షు లు కణితి అరుణ కుమారి, సిసిలు రవికుమార్, గోవిందరావు, శాంతి, పార్వతి, ఎకౌంటెంట్ సత్యవతి పాల్గొన్నారు.

ఇచ్ఛాపురం : పట్టణంలోని ఆర్‌జె ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన మహిళా దినోత్సవంలో వైసిపి సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే పిరియా సాయిరాజ్ పాల్గొన్నారు. ఇందులో భాగంగా మున్సిపల్ వైస్‌చైర్‌పర్సన్లు లాభాల స్వర్ణమణి, ఉలాల భారతిదివ్యలకు దుశ్శాలువలు కప్పి సన్మానించారు. కార్యక్రమంలో సీడప్ చైర్మన్ సాడి శ్యాంప్రసాద్‌రెడ్డి, రెడ్డి కార్పొరేషన్ చైర్మన్ దుక్క లోకేశ్వరరెడ్డి, సోంపేట ఎంపిపి డాక్టర్ నిమ్మన దాసు, ఇచ్ఛాపురం ఎంపిపి ప్రతినిధి కారంగి మోహనరావు, జెడ్‌పిటిసి ప్రతినిధి ఉప్పాడ రాజారెడ్డి, చాట్ల తులసీదాస్‌రెడ్డి పాల్గొన్నారు.

మండల మహిళా సమైక్య ఆధ్వర్యాన వెలుగు కార్యాలయంలో మ్యూజికల్ చేయిర్స్, రంగవల్లికలు, పాటల పోటీలు నిర్వహించారు. అనంతరం విజేతలకు బహుమతులను అందజేశార. ముందుగా మహిళలతో కలిసి ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఎపిఎం ప్రసాదరావు, మండల మహిళా సమాఖ్య అధ్యక్షులు డి.పార్వతమ్మ, ఆర్‌డబ్ల్యుఎస్ డిఇ ప్రసాద్, జలజీవన్ మిషన్ రమణ, ప్రకృతి వ్యవసాయం పిఆర్‌పి తులసీరామ్, సిసిలు రామకృష్ణ, మోహనరావు, మోహిని కృష్ణబాబు పాల్గొన్నారు.

మహిళా దినోత్సవ సందర్భంగా సిఐ ఈశ్వర్‌చంద్ర ప్రసాద్ మహిళా పోలీసులకు దుశ్శాలువ కప్పి సన్మానించార. కార్యక్రమంలో ఎస్ఐలు ఐ.గోవిందరావు, రామకృష్ణ పాల్గొన్నారు.

సమానత్వం కోసం సాగుదాం : ఐద్వా

వజ్రపుకొత్తూరు : మహిళలకు సమానత్వానికి పోరాటం ద్వారా సాధ్యమవుతుందని ఐద్వా జిల్లా నాయకులు బి.సుగుణావతి, సామాజిక కార్యకర్త ఎన్.ధనలక్ష్మి అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం పురస్కరించుకొని నగరంపల్లిలో డి.భానుమతి అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో ఎన్.ఈశ్వరమ్మ, పుష్పలత, లక్ష్మి, మోహిని డిల్లెమ్మ, ఎ.సోదమ్మ, లోలాక్షి, పారమ్మ పాల్గొన్నారు.

ఆమదాలవలస: మహిళా సాధికారతకు ప్రభుత్వాలు అందిస్తున్న తోడ్పాటును సద్వినియోగం చేసుకుని సరికొత్త ఉషస్సుకు మహిళలు నాంది పలకాలని మున్సిపల్ కమిషనరు కె.అప్పలనాయుడు పిలుపునిచ్చారు. మహిళా దినోత్సవం సందర్భంగా మున్సిపల్ కార్యాలయంలో మెప్మా ఆధ్వర్యాన కార్యక్రమం నిర్వహించారు. వివిధ పోటీలలో గెలుపొందిన విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఎ.వి.శ్రీనివాస్ పాల్గొన్నారు.

మహిళా దినోత్సవం సందర్భంగా ఎపిఎం పైడి కూర్మారావు ఆధ్వర్యాన మండల మహిళా సమాఖ్య అధ్యక్షులు తమ్మినేని ధనలక్ష్మి అధ్యక్షతన మహిళలతో పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం మండల స్థాయిలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన గ్రామస్థాయి మహిళా ప్రతినిధుల సిబ్బందిని సన్మానించారు. మండల స్థాయి ముగ్గులు, వంటలు, పాటలు, మ్యూజికల్ చైర్స్ పోటీల విజేతలకు బహుమతులను అందజేశారు.

టెక్కలి రూరల్: ప్రతి మహిళా కుటుంబంలో, సమాజంలో పురుషునితో సమానంగా గౌరవించినప్పుడే దేశాభివృద్ధి చెందుతుందని టెక్కలి ఆదిత్య ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ మేనేజ్‌మెంట్ ఇంజినీరింగ్ కళాశాల డైరెక్టర్ ప్రొఫెసర్ వి.వి.నాగేశ్వరరావు తెలిపారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా కళాశాలలో సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.ఎస్.శ్రీనివాసరావు, డాక్టర్ కె.బి.మధుసాహు, డాక్టర్ జి.వాసంతి, డాక్టర్ కె.లలితాభవానీ, కె.ప్రణయ పాల్గొన్నారు.

మహిళా దినోత్సవం సందర్భంగా మార్నింగ్ వాక్ ఫర్ పూర్ పీపుల్ సభ్యులు మహిళలకు నెల రోజులకు సరిపడే 25 కేజీల బియ్యం, 20 రకాల నిత్యావసర వస్తువులను అందజేశారు. కార్యక్రమంలో అభయం అధ్యక్షుడు దేవాది శ్రీనివాసరావు, సభ్యులు పాల్గొన్నారు.

లావేరు : మహిళా దినోత్సవం సందర్భంగా ఎపిఎం ఎం.మాధవీలత, మహిళా సమాక్య అధ్యక్షులు కొమ్ము కళావతిలను సన్మానించారు. అలాగే బెజ్జిపురం స్వచ్ఛంద సేవా సంస్థ వివేకానంద సాధనం ఆవరణలో మహిళలకు ముగ్గలు, ఆటలు, నృత్య పోటీలు నిర్వహించారు. అనంతరం విజేతలకు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో ఎంపిడిఒ కె.సురేష్‌కుమార్, ఎపిఒ సత్యవతి, బెజ్జిపురం యూత్ క్లబ్ అధ్యక్షుడు ఎం.ప్రసాదరావు, నాబార్డు జిల్లా అభివృద్ధి మేనేజర్ జి.వి.బి.డి.హరిప్రసాద్, డాక్టర్ ఎన్.అనురాధ, జిల్లా క్షయ కంట్రోల్ అధికారిని భాగ్యలక్ష్మి పాల్గొన్నారు.

పలాస : స్థానిక వెలుగు కార్యాలయంలో మహిళా దినోత్సవం సందర్భంగా వెలుగు సిసిలు, సిఎఫ్‌లు ఆధ్వర్యాన ఆటలు, ముగ్గులు పోటీలు నిర్వహించారు. ఇందులో గెలుపొందిన పి.కవిత, డి.శిరీష, కె.కుమారి, జె.ధనలక్ష్మి, జయలక్ష్మి యశోద, కుర్చీ ఆటలో అనసూయ, గీతలకు బహుమతులు ప్రదానం చేశారు. అనంతరం మండల సమైక్య అధ్యక్షులు పి.రాజేశ్వరి, ఉపాధ్యక్షులు సుగుణ, కోశాధికారి ఎం.వరలక్ష్మిలకు దుశ్శాలువ కప్పి సన్మానించారు. కార్యక్రమంలో అధ్యక్షత పోతనపల్లి అరుణ, ప్రతినిధులు నాగమణి, జ్యోతి, సీతమ్మపూర్ణ, ఉషోదయ మహిళా సంఘం ప్రతినిధులు జయమ్మ, స్నేహ పాల్గొన్నారు.

పలాస మండల పరిషత్ కార్యాలయంలో సచివాలయం మహిళా ఉద్యోగులకు, కాశీబుగ్గ విద్యా వాహిని కళాశాలలో పిడబ్ల్యూ ఆధ్వర్యాన రాష్ట్ర ఉపాధ్యక్షులు రమసుందరి, జిల్లా అధ్యక్షులు బతకల ఈశ్వరమ్మ, సిపిఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ జిల్లా కార్యదర్శులు వంకల మాధవరావు, పోతనపల్లి కుసుమలకు సన్మానించారు. అరుణోదయ కళాకారులు కామ్రేడ్ సోమేష్, వినోద్ తదితరులు విప్లవ గీతాలు ఆలాపించారు. లయన్స్ క్లబ్ పలాస క్యాజు ల్యాండ్ వనిత ఆధ్వర్యాన 1972 నుంచి 1978 వరకు పాతపట్నం నియోజకవర్గంలో ఎమ్మెల్యేగా చేసిన చుక్క పగడాలమ్మ (ముక్తాపురం), ముక్తాపురం సర్పంచ్ ఎ.జయప్రదకు సన్మానించారు. పలాస సిఐటియు కార్యాలయంలో మహిళా దినోత్సవ వేడుకలలో ఐద్వా కార్యదర్శి ఎన్.ఢిల్లేశ్వరి, నాయకులు జె.భాగ్యలక్ష్మి, తరంగిణి, రేణుక, సుజాత, మౌనిక, గాయత్రి, త్రివేణి, భారతి పాల్గొన్నారు.

మందస : మండలంలోని హరిపురం ప్రభుత్వాస్పత్రిలో పలాస మండలం రామకృష్ణాపురం సత్యసాయి విద్యావిహార్ ఆధ్వర్యాన ప్రసూతి వైద్యులు స్వరాజ్య లక్ష్మి రోగులకు పళ్లు, పులిహోర పంపిణీ చేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ప్రీతిచౌదరీ, శుభశ్రీ, అనుదీప్ పాల్గొన్నారు. కాశీబుగ్గ పద్మానాభపురంలో అఖిల బారత ప్రగతిశీల మహిళా సంఘం పోతనపల్లి సుందరమ్మ అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో ఎం.మల్లేశ్వరరావు, మహిళా సంఘం నేతలు కోనారి ఈశ్వరమ్మ, మద్దిల తులసమ్మ పాల్గొన్నారు.

మెళియాపుట్టి : పెద్దపద్మాపురం ఎంపిటిసి ఉర్లాన హంసమ్మ మహిళా దినోత్సవ సందర్భంగా వైస్ ఎంపిపి సవర ఆదినాయుడు, ఎఎంసి మాజీ వైస్ చైర్మన్ అనపాన రాజశేఖర్‌రెడ్డి సన్మానించారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు జనపరెడ్డి కన్నబాబు, పెద్దింటి చందర్రావు, ఎస్.గౌరీస్, ఎంపిటిసి ఉల్లాన రుషి పాల్గొన్నారు.

పర్లాకిమిడి : గజపతి జిల్లా కాశీనగర్ బ్లాక్ వల్లాడ పంచాయతీ మంజలిగూడలో ప్రగతిశీల మహిళా సంఘం అంజలి సబర్ అధ్యక్షతన మహిళా దినోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో బాలేశ్వరీ సబర్, నియాపలి సబర్, సుకాంత్ సబర్, మనాలిస సబర్, గల్లంతి సబర్, సరోజని సబర్ తదితరులు పాల్గొన్నారు.

పొందూరు : స్థానిక వైఎస్ఆర్ క్రాంతి పథం కార్యాలయంలో మహిళా దినోత్సవం సందర్భంగా ఎపిఎం గురుగుబెల్లి శ్యామలరావు మహిళలకు దుశ్శాలువ కప్పి సన్మానించారు. కార్యక్రమంలో పొందూరు డిసిసిబి బ్రాంచ్ మేనేజర్ ప్రసూన కుమారి, సిసిలు సత్యనారాయణ, సూర్యప్రభ, త్రినాథమ్మ, తదితరులు పాల్గొన్నారు.



ట్రోఫీని అందజేస్తున్న డైరెక్టర్ నాగేశ్వరరావు

క్రీడలతో మానసికోల్లాసం

ప్రజాశక్తి- టెక్కలి రూరల్

క్రీడలతో శారీరక, మానసిక ఉల్లాసం, ఆరోగ్యం పెంపొందుతాయని ఐతమ్ కళాశాల డైరెక్టర్ ప్రొఫెసర్ వి.వి నాగేశ్వరరావు అన్నారు. యాస్పైర్ 2కె3లో భాగంగా పది రోజులుగా ఐతమ్ కళాశాలలో 12 విభాగాల క్రీడా పోటీలు నిర్వహించి గెలుపొందిన క్రీడాకారులకు బుధవారం బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతి విద్యార్థి చదువుతో పాటు క్రీడల్లో సైతం పాల్గొనాలని సూచించారు. క్రీడల్లో రాష్ట్ర, జాతీయ స్థాయిలో గుర్తింపు పొంది పలు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ రంగాల్లో ఉద్యోగాలు చేసిన విద్యార్థులు ఐతమ్ ఉండడం గర్వకారణంగా ఉందన్నారు. అత్యంత ప్రామాణికం పాటిస్తున్న క్రికెట్ మైదానంతో పాటు వాలీబాల్, ఖోఖో, ఫుట్‌బాల్, బాస్కెట్‌బాల్, లాంగ్‌జంప్, షార్ట్‌పుట్, బాడీబిల్డింగ్, పవర్ లిఫ్టింగ్ వంటి క్రీడలకు సంబంధించిన మౌలిక వసతులను, వ్యాయామ శాలలను ఏర్పాటు చేశామన్నారు. మహిళా క్రీడాకారలను ప్రోత్సహించేందుకు ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నామని వివరించారు. ఈ పోటీల్లో భాగంగా అన్ని క్రీడల్లో అత్యంత ప్రతిభ కనపరచిన ఐటి విభాగం విద్యార్థులకు ఓవరాలు ఛాంపియన్ షిప్ కింద ప్రథమ బహుమతి, పలు బృందాలకు, వ్యక్తిగత క్రీడాకారులకు 29 బహుమతులను అందజేశామన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.ఎస్.శ్రీనివాసరావు, యాస్పైర్ కో-ఆర్డినేటర్ డాక్టర్ యు.డి.ప్రసన్న, పలువురు హెచ్‌డిలు, స్పోర్ట్స్ కో-ఆర్డినేటర్ డాక్టర్ పి.వి.మురళీధర్, పీడీలు ఎస్.లక్ష్మణమూర్తి, టి.మురళీమోహన్, జె.తేజశ్వరి పాల్గొన్నారు.

అప్పాపురంలో 'రాష్ట్రానికి ఇదేం ఖర్మ'

ప్రజాశక్తి- లావేరు

రానున్న సార్వత్రిక ఎన్నికల్లో వైసిపి ప్రభుత్వాన్ని తరిమికొట్టాలని ఎచ్చెర్ల ఎఎంసి మాజీ చైర్మన్ యినపకుర్తి తోటయ్యదొర అన్నారు. మండలంలోని అప్పాపురంలో బుధవారం ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో భాగంగా ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ వైఫల్యాలతో ముద్రించిన పోస్టర్లను అందజేశారు. ప్రభుత్వాన్ని ప్రశ్నించిన వారిపై అక్రమ కేసులు పెట్టి వేధింపులకు గురిచేస్తున్నారని అన్నారు. కార్యక్రమంలో మండల తెలుగు యువత అధ్యక్షుడు గంట్యాడ మహేష్, ఎంపిటిసి మాజీ సభ్యులు లంక రాంబాబు, నార తౌడు, జోగేష్ తదితరులు పాల్గొన్నారు.


ప్లకార్డులను ప్రదర్శిస్తున్న టిడిపి నాయకులు

చట్టాలపై అవగాహన పెంపొందించుకోవాలి

బూర్జ : ప్రభుత్వం మహిళల రక్షణ కోసం ఎన్నో చట్టాలను అమలు చేస్తుందని, వాటిని అవగాహన పెంపొందించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఆమదాలవలస జూనియర్ సివిల్ జడ్జి ఎస్.మణి అన్నారు. మండలంలోని పెద్దపేట ఆర్ట్స్ సంస్థ కార్యాలయంలో ప్రపంచ మహిళా దినోత్సవం సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా గర్భ నిరోధక, బాల్య వివాహాల నిరోధక చట్టాన్ని గురించి అందరూ తెలుసుకోవాలని తెలిపారు. ఆర్ట్స్ సంస్థ డైరెక్టర్ నూక సన్యాసిరావు మాట్లాడుతూ ఆకాశంలో సగమైన మహిళలకు ఆదివాసీ ప్రాంతాల్లో మహిళల అభివృద్ధికి, జీవనోపాధులు అభివృద్ధికి కషి చేస్తున్నామని అన్నారు. అగ్రికల్చర్ డైరెక్టర్, సీనియర్ శాస్త్రవేత్త తమ్మినేని శ్రీలత మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలన్నారు. కృషి విజ్ఞాన కేంద్రం కో-ఆర్డినేటర్ డాక్టర్ భాగ్యలక్ష్మి మాట్లాడుతూ మహిళలక వస్తువు విలువ ఆధారిత శిక్షణ ద్వారా మహిళలకు మరింత ఆదాయం వస్తుందని, అలానే చిరుధాన్యాలతో మరింత అభివృద్ధి చెందాలని అన్నారు. కార్యక్రమంలో పాలకొండ హార్టికల్చర్ ఆఫీసర్ అమరేశ్వరి, ఎఒ రాజేశ్వరరావు, మన్యం సహజ ఉత్పత్తిదాల కంపెనీ చైర్మన్ నిమ్మక వరహాలమ్మ, కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త హరిబాబు, న్యాయవాదులు తమ్మినేని


మాట్లాడుతున్న జడ్జి మణి

అన్నంనాయుడు, కింతలి త్రినాథరావులు ఆపల్గొన్నారు. అనంతరం ఉత్తమ సేవలు అందించిన మహిళలకు నారీశక్తి పురస్కార్ అవార్డులను ఆర్ట్స్ సంస్థ నుంచి అందజేశారు.

లక్ష్యసాధనకు ఏకాగ్రత కీలకం

వ్యక్తిత్వ వికాస నిపుణులు సతీష్

ప్రజాశక్తి- నరసన్నపేట

లక్ష్యసాధనలో ఏకాగ్రతే ముఖ్యమని, దీనివల్ల ఉన్నత శిఖరాలు అధిరోహించవచ్చని ప్రముఖ రచయిత, వ్యక్తిత్వ వికాస నిపుణులు డాక్టర్ మాకేనా సతీష్ తెలిపారు. కొన్ని అంశాలను విద్యార్థులు నిరంతరం సాధన చేయాలని సూచించారు. పద్మావతి జూనియర్ కళాశాలలో బుధవారం నిర్వహించిన వీడ్కోలు సభకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతి విషయమూ నేర్చుకోవడం, దానిని పదే పదే మననం చేసుకొని తద్వారా మేధాశక్తికి మరింత పదునుపెట్టడం వంటి అంశాలను విద్యార్థి దశ నుంచే అలవాటు చేసుకోవాలని సూచించారు. ఏదైనా ఒక అంశాన్ని అనర్గళంగా నేర్చుకున్నప్పుడే ఎప్పటికీ గుర్తుండిపోతుందన్నారు. కళాశాల డైరెక్టర్



మాట్లాడుతున్న వ్యక్తిత్వ వికాస నిపుణులు సతీష్

సిహెచ్.దుర్గాప్రసాద్ మాట్లాడుతూ ప్రతిఒక్కరి విజయానికీ ఆరోగ్యం, కీర్తి, విషయ పరిజ్ఞానం, ప్రేమ, ఉరకలు వేసే ఉత్సాహం, విజ్ఞానం అసరమన్నారు. కష్టించి పనిచేయడం, కేంద్రీకృత దృష్టి అవసరమని వివరించారు. గమ్యం, సుఖం, సంతోషం, మనసు, హృదయం మధ్య నెలకొన్న సునిశిత భేదం వాటి ప్రభావాలను విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.


కోటబొమ్మాళి : రోగులను పరీక్షిస్తున్న వైద్య సిబ్బంది

వైద్య శిబిరానికి స్పందన

ప్రజాశక్తి- కోటబొమ్మాళి

మండలంలోని హరిశ్చంద్రపురంలో బుధవారం అంతర్జాతీయ మహిళ దినోత్సవాన్ని పురస్కరించుకొని కొత్తమ్మతల్లి ఫార్మర్ పొడ్యూషింగ్ కంపెనీ లిమిటెడ్ ఆధ్వర్యాన శ్రీకాకుళానికి చెందిన మెడికవర్ సౌజన్యంతో మెగా ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఇందులో భాగంగా వైద్యులు కోట బాలసూరి ప్రకాష్, పి.అనురుద్ధినాయుడు, ఆర్.సుధీర్, సింధుజ, మౌనికలు 400 మందికి రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఇందులో నలుగురుకి మెరుగైన వైద్యం కోసం మెడికవర్‌కు రిఫర్ చేశారు. అలాగే శ్రీకాకుళం రెడ్‌క్రాస్ ఆధ్వర్యాన నిర్వహించిన రక్తదాన శిబిరంతో 50 మంది నుంచి రక్తం సేకరించారు. కార్యక్రమంలో కొత్తమ్మతల్లి సిఇఒ పూజారి సత్యప్రియ, మాజీ సర్పంచ్ పూజారి శైలజ, డాక్టర్ బి.శ్రీధర్, బి.సన్యాసిపాత్రుడు, జాతీయ యువజన అవార్డు గ్రహీత పెంచి చైతన్య కుమార్, టెక్కలి ఎడిఎ తిరుమలరావు, ఎఒలు ఎస్.గోవిందరావు, ఆర్.అప్పారావు పాల్గొన్నారు.

వ్యక్తి అరెస్టు

కోటబొమ్మాళి: మండలంలోని దంతలో నెల 28న జరిగిన ఘర్షణలో బొమ్మాళి శివ ఇచ్చిన ఫిర్యాదు మేరకు అదే గ్రామానికి చెందిన సూరపు గోవిందరావును బుధవారం అరెస్టు చేసి రిమాండ్‌కు పంపినట్టు ఎస్ఐ ఎస్.కె. మహ్మద్ అలీ తెలిపారు. బొమ్మాళి శివను కులం పేరుతో దూషించి దాడికి పాల్పడ్డాడని, శివ ఫిర్యాదు మేరకు కాశీబుగ్గ డిఎస్‌పి శివరామిరెడ్డి, టెక్కలి సిఐ సూర్యచంద్రమౌళి దర్యాప్తు చేపట్టారని అన్నారు. అనంతరం నిందుతుడుని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించామని తెలిపారు.

నరేంద్రకు ఆర్థికసాయం

ప్రజాశక్తి- రణస్థలం

మండలంలో కోటపాలెం సచివాలయంలో హార్టికల్చర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్న ఎం.నరేం ద్ర కొద్ది రోజుల క్రితం సంభవించిన రోడ్డు ప్రమాదంలో గాయపడ్డాడు. చెన్నయ్‌లో చికిత్స తీసుకుంటున్నాడు. ఆర్థిక స్తోమతను మించి వైద్యానికి ఖర్చు పెట్టడంతో తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. దీంతో మండలంలోని సచివాలయ సిబ్బంది రూ.60 వేలు వసూలు చేశారు. ఈ మొత్తాన్ని నరేంద్ర స్వగ్రామం ఆముదాలవలస మండలం నిమ్మతోర్లవాడ బుధవారం వెళ్లి ఆర్థికసాయం అందించారు. కార్యక్రమంలో మండల సచివాలయం కమిటీ ప్రెసిడెంట్ లంక గణపతి, జనరల్ సెక్రటరీ సతీష్‌కుమార్, సహ ప్రెసిడెంట్ రామునాయుడు, ట్రెజరీ శంకరరావు, శ్రీను, రామారావు, ఉదయ్‌భాను పాల్గొన్నారు.


ఆర్థికసాయం అందజేస్తున్న సచివాలయ ఉద్యోగులు

క్రైమ్ కార్నర్


రాజా మృతదేహం

బైక్ బోల్తా : యువకుడు మృతి

నౌపడ: సంతబొమ్మాళి మండలం నౌపడకు చెందిన బొంగు రాజా (38) ద్విచక్ర వాహనం బోల్తా పడి మృతి చెందాడు. నౌపడ పోలీసుల కథనం మేరకు... మృతుడు ఉపాధి నిమిత్తం దుబాయ్‌లో పనిచేస్తున్నారు. రెండు నెలల క్రితం స్వగ్రామానికి వచ్చాడు. మరో రెండు రోజుల్లో దుబాయ్ వెళ్లనున్నారు. వ్యక్తిగత పని నిమిత్తం రాజానౌపడ నుంచి కోటపాడులోని అత్తవారింటికి ద్విచక్ర వాహనంపై బుధవారం వెళు న్నారు. యామాలపేట-పోతునాయుడుపేట గ్రామాల మధ్యలో మలుపు వద్ద ఎదురుగా వస్తున్న గుర్తు తెలియని వాహనాన్ని తప్పించిపోయి బైక్ రోడ్డు పక్కనే ఉన్న పొలాల్లోకి వెళ్లిపోయింది. ఈ ప్రమాదంలో రాజా తలపై బలమైన గాయం కావడంతో అక్కడికక్కడే మృతి చెందారు. స్థానికులు వచ్చిన సమాచారంతో పోలీసులు సంఘటన స్థలాన్ని మృతదేహాన్ని పరిశీలించారు. శవపంచనామా అనంతరం పోస్టుమార్టం నిమిత్తం టెక్కలి జిల్లా ఆస్పత్రికి తరలించారు. మృతుడుకు భార్య దివ్య, కుమార్తె అక్షర, కుమారుడు హర్షవర్ధన్ ఉన్నారు. కుటుంబ పెద్ద దిక్కును కోల్పోవడంతో కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. దీంతో నౌపడలో విషాదఛాయలు అలముకున్నాయి. నౌపడ ఎఎస్ఐ మెట్ట చంద్రరావు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

గీత కార్మికుడు దుర్మరణం


ఎర్రయ్య మృతదేహం

పోలాకి: మండలంలోని దీర్ఘావికి చెందిన గేదెల ఎర్రయ్య (47) ఈత చెట్టు పైనుంచి జారి పడి మృతి చెందిన సంఘటన బుధవారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు... యర్రయ్య వృత్య రీత్యా కల్లుగీత కార్మికునిగా కొనేళ్లుగా ఈతకల్లు అమ్ముకుంటూ జీవణం సాగిస్తున్నారు. అందులో భాగంగానే బుధవారం 12 గంటలు ప్రాంతంలో ఈత కల్లు తియ్యడానికి చెట్టు ఎక్కి జారి పడిపోయాడు. దీంతో తీవ్రంగా గాయపడడంతో 108లో ఆస్పత్రికి తరలిస్తుండగా... మార్గమధ్యంలో పరిస్థితి విషమించి మృత్యువాత పడ్డాడు. మృతుడికి భార్య లక్ష్మి, ముగ్గురు పిల్లలు ఉన్నారు. కుటుంబ పెద్ద మృతి చెందడంతో బోరున విలపిస్తున్నారు. దీంతో గ్రామంలో విషాద ఛాయలు అలముకున్నాయి. కుటుంబసభ్యులు ఫిర్యాదు మేరకు ఎస్ఐ నరసింహామూర్తి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

నేడు ఉచిత వైద్య శిబిరం

శ్రీకాకుళం : నగరంలోని కిమ్స్ ఆస్పత్రిలో ఈ నెల 9న ప్రపంచ కిడ్నీ దినోత్సవం సందర్భంగా ఉదయం 9 నుంచి 2 గంటల వరకు ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నామని మెడికల్ సూపరింటెండెంట్ ఒక ప్రకటనలో తెలిపారు. కిడ్నీ వ్యాధి వైద్య నిపుణులు డాక్టర్ పి.శరత్‌జ్యోత్స్న, బెందాళం గౌతమ్‌లు వైద్య పరీక్షలు నిర్వహిస్తారని పేర్కొన్నారు. డాక్టర్ల సలహా మేరకు కిడ్నీ రోగులకు అవసరమైన రక్తం, వైద్య పరీక్షలపై 50 శాతం రాయితీ ఇస్తున్నామని చెప్పారు. అనంతరం కిమ్స్ వైద్యులతో కిడ్నీ రోగులు తమ ఆరోగ్యంపై తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన, సూచనలు ఇప్పిస్తామని తెలిపారు. కిడ్నీ రోగులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.



దగ్ధమవుతున్న గడ్డివామి

గడ్డివామి దగ్ధం

ప్రజాశక్తి– ఆమదాలవలస

మండలంలోని లొద్దలపేట-గండ్రేడు గ్రామాల పొలంలో మంగళవారం రాత్రి గడ్డివామి దగ్ధమైంది. ప్రధాన లైన్ విద్యుత్ వైర్లను నిప్పులు రాలడంతో ఈ ప్రమాదం చోటు చేసుకుంది. దీంతో ఆయా గ్రామస్తులు అప్రమత్తమైన వరిచేను కుప్పలకు, ధాన్యం బస్తాలకు మంటలు వ్యాపించకుండా మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. యంత్రాలతో నూర్పిడి చేసే క్రమంలో వరిగడ్డి గాలికి ఎగిరి విద్యుత్ తీగలపై పడుతుందని, దీంతో సర్క్యూట్ జరిగి నిప్పులు కింద పడి ఇటువంటి ప్రమాదాలు సంభవిస్తున్నాయని సంబంధిత శాఖాధికారులు తెలిపారు. విద్యుత్ తీగలకు కొంచెం దూరంలో నూర్పిడి యంత్రాలు ఉంచి పనిచేసుకోవాలని రైతులకు సూచిస్తున్నారు.

జనసేన సభను విజయవంతం చేయాలి

ఆమదాలవలస : జనసేన ఆవిర్భావ సభను జన సైనికులు విజయవంతం చేయాలని జనసేన నియోజకవర్గ నాయకులు పైడి మురళీమోహన్ ఒక ప్రకటనలో కోరారు. ఈ నెల 14న మచిలీపట్నం వేదికగా నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. జనసేన అధినేత పవన్ కళ్యాణ్ పాల్గొంటారని తెలిపారు.



చలివేంద్రాన్ని ప్రారంభించిన సర్పంచ్ అప్పలనాయుడు

చలివేంద్రం ఏర్పాటు

జి.సిగడాం : చలివేంద్రం వేసవిలో ప్రజల దాహార్తిని తీర్చేందుకు బుధవారం ఏర్పాటు చేశామని శ్రీకాకుళం నెహ్రూ యువ కేంద్రం వాలంటీర్ కామర్స్ నాగరాజు తెలిపారు. కొత్త కుండలో మజ్జి, తాగునీరు చల్లగా ఉంటుందని మదుపాం సర్పంచ్ బోగాది అప్పలనాయుడు అన్నారు. ఈ వేసవి కాలమంతా ఎక్కువ రద్దీగా ఉండే శ్రీశయన కూడలి, అమ్మవారి ఆలయ ప్రదేశాల్లో చలివేంద్రాలను ఏర్పాటు చేశామని యువకులు తెలిపారు.

దళితుల సమస్యలను పరిష్కరించాలి



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

శ్రీకాకుళం అర్బన్ : జిల్లాలో దళితులకు ఎదురవుతున్న సమస్యలను పరిష్కరించాలని దళిత సంఘాల నాయకులు మిస్క కృష్ణయ్య కోరారు. ఈ మేరకు కలెక్టరేట్‌లోని జెసి ఎం.నవీన్‌ను బుధవారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ గురుకులాల మాజీ సమన్వయకర్త వై.యశోదలక్ష్మిపై నియమించిన విచారణ ఏడు నెలలు గడచినా ఇంతవరకు చర్యలు చేపట్టలేదని, తక్షణమే ఆమెపై చర్యలు తీసుకోవాలని కోరారు. అలాగే ఇచ్ఛాపురం మండలం మశాకాపురంలో దండాసి వీధికి వెళ్లే రోడ్డులో నవగ్రహాల ఆలయం నిర్మాణం పేరుతో రోడ్డు లేకుండా చేస్తున్నారని అన్నారు. ఇబ్బందులకు గురి చేస్తున్న స్థానికులపై చర్యలు చేపట్టి బాధితులకు న్యాయం చేయాలని కోరారు. పొందూరు మండలం దళ్లవలసలో దళితులు నివాసంలో డంపింగ్ యార్డు పెట్టి చాలా ఇబ్బందులకు గురిచేస్తున్నారని, గతంలో ఈ సమస్య తమరి దృష్టికి తీసుకొచ్చామని తెలిపారు. జెసిని కలిసిన వారిలో గణేష్, చల్లా రామారావు, రాకోటి రాంబాబు, నవిరి లక్ష్మణ్, నవిరి నీలాచలం, దివ్వాల మల్లేశ్వరరావు ఉన్నారు.

ప్రకృతి వ్యవసాయం ముద్దు

ప్రజాశక్తి– ఆమదాలవలస



అవగాహన కల్పిస్తున్న సిబ్బంది

మండలంలోని గరిమెళ్ల కొత్తవలసలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది ఆధ్వర్యాన రైతులతో కలిసి నవధాన్యాలు సాగు – నేల తల్లి బాగు అంటూ మండల యాంకర్ నక్క చిరంజీవిరావు ఆధ్వర్యాన బుధవారం అవగాహన నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రకృతి వ్యవసాయంలో 33 రకాల విత్తనాలను నేలలో వేసుకోవడం వల్ల వచ్చే ఆవశ్యకతను తెలిపారు. రైతులు ప్రకృతి సేద్య విధానంలో పలు రకాల పంటలను వేసుకోవడంతో భూమిలో పంటలకు అవసరమైన సేంద్రీయ కర్బనం తయారవుతుందన్నారు. భూమి లోపల సూక్ష్మజీవుల వ్యవస్థ అభివృద్ధి చెంది నేల సహజ ఎరువుల ఫ్యాక్టరీగా తయారవుతుందన్నారు. రైతులందరూ నవధాన్యాలు సాగును చేపట్టాలని వివరిస్తూ రైతులకు వివరించారు. కార్యక్రమంలో సర్పంచ్ ప్రతినిధి పంగ సతీష్, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది సురేష్, మల్లేష్, తిరుపతి, జానకిరామ్, కృష్ణవేణి పాల్గొన్నారు.



నిత్యావసర సరుకులను అందిస్తున్న సభ్యులు

నిత్యావసర సరుకుల పంపిణీ

కవిటి: నిరుపేద మహిళకు అండగా నిలబడి మాతృమూర్తి యువజన సంఘం మరోసారి తన దాతృత్వం చాటుకుంది. మండలంలోని కుసుంపురానికి చెందిన దినసరి కూలీ జేమా దొళాయి ఒంటరి మహిళ దీర్ఘ కాలిక వ్యాధితో బాధపడుతోంది. రెక్కాడితే గానీ డొక్కాడని ఆమె పరిస్థితి తెలుసుకున్న మాతృమూర్తి యువజన సంఘం సభ్యులు నెలకు సరిపడే నిత్యావసర సరుకులను (బియ్యం, కందిపప్పు, నూనె, పంచదార, బంగాళ దుంపలు, ఉల్లి, బెల్లము, పసుపు పొడి, గోధుమపిండి) అన్నపూర్ణ అమృతహస్తం పేరిట బుధవారం అందజేశారు. కార్యక్రమంలో సంఘ సభ్యులు చలపతి, సురేష్, భాష, కవీస్వరరావు, రమేశ్, నాగేష్ తదితరులు పాల్గొన్నారు.

సిఎం సహాయనిధి మంజూరు



చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్సీ శ్రీనివాస్

కోటబొమ్మాళి: ఇటీవల భవన నిర్మాణం ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన మండలంలోని ఊడికలపాడుకు చెందిన నేతింటి సూర్యనారాయణకు వైద్య ఖర్చుల నిమిత్తం సిఎం సహాయ నిధి రూ.5.50 లక్షలు మంజూరైంది. ఈ చెక్కును ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్ తన సోదరుడు, వైసిపి నాయకులు నేతింటి అప్పలస్వామికి టెక్కలి క్యాంప్ కార్యాలయంలో బుధవారం అందజేశారు. కార్యక్రమంలో జెడ్‌పిటిసి దువ్వాడ వాణి, పిఎసిఎస్ అధ్యక్షులు బాడాన మురళి, మండల పరిషత్ ఉపాధ్యక్షుడు దుక్క రోజా, బోయిన నాగేశ్వరరావు, సర్పంచ్ కాళ్ల సంజీవరావు పాల్గొన్నారు.



బీమా నగదును అందజేస్తున్న ఈశ్వరరావు

బీమా సాయం అందజేత

సంతబొమ్మాళి : మండలంలోని మరువాడ పంచాయతీ చిన్నమరువాడకు చెందిన చొక్కర ధమయంతి మంగళవారం మృతి చెందింది. ఆమె వైఎస్ఆర్ బీమాలో చేరడంతో తక్షణ సాయం కింద నామిని నీలమ్మకు రూ.పది వేలు వైసిపి ఇన్‌ఛార్జి గంట ఈశ్వరరావు బుధవారం అందజేశారు. కార్యక్రమంలో వెల్ఫేర్ అసిస్టెంట్ అంగూరు మధుసూదనరావు, గ్రామ వాలంటీర్లు మైలపిల్లి లక్ష్మి, తిప్పాన సంతోష్‌కుమార్, చొక్కర రాంబాబు, చొక్కర కృష్ణారావు, సూరాడ రామారావు పాల్గొన్నారు.



ఉత్సాహంగా హోలీ

ఇచ్ఛాపురం : ఇచ్ఛాపురంలో బుధవారం హోలీ సంబరాలు ఉత్సాహంగా, ఉల్లాసంగా నిర్వహించారు. ఉదయం నుంచి చిన్నారులు, పెద్దలు ఒకరి ఒంటిపై మరొకరు రంగులు జల్లుకుని ఆనందంగా గడిపారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ పి.రాజ్యలక్ష్మి చురుకుగా పాల్గొన్నారు. మిత్ర బృందం తోటి కౌన్సెల్ సభ్యులతో కేరింతలు మధ్య హోలీని నిర్వహించారు. అలాగే గాంధీ పార్కులో షటిల్ టీమ్, సురంగరాజా క్రీడా మైదానంలో వాకర్స్‌క్లబ్ సభ్యులు ఉత్సాహంగా హోలీ జరుపుతున్నారు.

విద్యుత్ స్తంభాల ఏర్పాటు



ఏర్పాటు చేస్తున్న విద్యుత్ స్తంభం

ఇచ్ఛాపురం : మున్సిపాలిటీ పరిధిలో 20 వార్డు రత్నాకన్న జగనన్న కాలనీలో ఎట్టకేలకు బుధవారం విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేస్తున్నారు. కాలనీలో విద్యుత్ స్తంభాలు లేకపోవడంతో లబ్ధిదారులు ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. ఈ విషయమై జిల్లా ప్రచార కమిటీ చైర్మన్, వార్డు కౌన్సిలర్ తాడి ఆదిరెడ్డి విద్యుత్‌శాఖాధికారుల దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ఆ శాఖాధికారులు స్పందించి విద్యుత్ స్తంభాలను ఏర్పాటు చేశారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన

ఇచ్ఛాపురం : ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలను సిఐ ఈశ్వర్ చంద్ర ప్రసాద్ బుధవారం పరిశీలించారు. పట్టణంలోని రెండు పోలింగ్ కేంద్రాల్లో ఎన్నికలు సందర్భంగా బందోబస్తు ఏర్పాటుకు పరిశీలించామని తెలిపారు. ఈయన వెంట పట్టణ ఎస్ఐ గోవిందరావు ఉన్నారు.

అరసవల్లి సందర్శన

శ్రీకాకుళం అర్బన్ : అరసవల్లి సూర్యనారాయణ స్వామి ఆలయాన్ని రాష్ట్ర దేవాదయ ధర్మదాయశాఖ డిప్యూటీ కమిషనర్ రత్నరాజు బుధవారం సందర్శించారు. ఆయనకు ఆలయ ప్రధాన అర్చకులు ఇప్పిలి శంకరశర్మ స్వాగతం పలికారు. ఆలయంలో స్వామివారి సేవల్లో పాల్గొన్న అనంతరం అనివేటి మండపంలో ఆయనకు స్వామివారి శేష వస్త్రాన్ని కప్పి జ్ఞాపికను అందజేశారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ కె.వెంకటేశ్వరరావు, జూనియర్ అసిస్టెంట్ బి.ఎస్.చక్రవర్తి, ఆలయ అర్చకులు పాల్గొన్నారు.



చిత్రపటాన్ని అందుకుంటున్న రత్నరాజు